క్లుప్తంగా

కల్వకుర్తి వాసికి డాక్టరేట్



నాగేశ్వర్

కల్వకుర్తి రూరల్: పట్టణానికి చెందిన గుండ నాగేశ్వర్‌కు కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్ లభించింది. డాక్టరాఫ్ ఫిలాసఫీలో ఆర్గానిక్ కెమిస్ట్రీని రాజస్తాన్‌లోని ఓపీజేఎస్ యూనివర్సిటీ నాగేశ్వర్‌కు ఈ డాక్టరేట్‌ను ప్రకటించింది. డాక్టర్ కైలాశ్ నారాయణ ఆధ్వర్యంలో నాగేశ్వర్ రీసర్చ్ పనులు నిర్వహించారు.

తర్నికల్‌లో వైద్యశిబిరం

కల్వకుర్తి రూరల్: వైద్యశిబిరాలు పేద ప్రజలకు వరం లాంటివని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని తర్నికల్‌లో డాక్టర్ అఖిల్ ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి వైద్యుల సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 325 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఇల్లు లేని ఇద్దరు నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కోసం ఆయన భూమి పూజ చేశారు. నిర్మల, పాండుగౌడ్, తిరుపతమ్మ, శేఖర్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే వైద్య పరీక్షలు

మన్ననూర్: అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ ఓ ప్రజా ప్రతినిధి, వైద్యురాలుగా ప్రజలకు సేవలందిస్తున్నారని మండల ప్రజలు కొనియాడుతున్నారు. కొంత కాలంగా ప్రజలతో మమేకమై మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మన్ననూర్‌లోని వివిధ కాలనీల్లో అభివృద్ధి పనులు, ప్రజల సమస్యలు క్షేత్ర స్థాయిలో పర్యటించి తెలుసుకున్నారు. ఉమామహేశ్వర కాలనీకి చెందిన హాతీరాం భార్య దేవి కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆమె వారి ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. ఆమె వెంట ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీటీసీ శ్రీనివాసులు, హీర్యానాయక్, బౌరమ్మ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాసులకు మంగళవారం వినతి అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి దశరథం మాట్లాడారు. 301, 302 సర్వే నంబర్‌లో పెద్దకార్పాములలో 19 ఎకరాల 14 కుంటల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. నేటికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయకపోవడంతో పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చిన్నకొత్తపల్లి, కొత్తయాపట్ల, పాతయాపట్ల గ్రామాల్లో 30 ఏళ్ల కిందట ప్రభుత్వం భూములు కొనుగోలు చేసి, పేదలకు ఇవ్వకపోవడంతో ఆ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని అన్నారు. శంకర్, మద్దిలేటి, కృష్ణయ్య, చెన్నయ్య, శివ పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన మల్లేశ్వరి మంగళవారం తెల్లవారుజామున పురిటినొప్పులు రావడంతో 108 అత్యవసర సర్వీస్‌కు సమాచారం ఇచ్చారు. పురిటినొప్పులు ఎక్కువ కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్తుండగానే 108 అంబులెన్స్ సిబ్బంది టెక్నీషియన్ శ్రీకాంత్, పైలెట్ రాముడు మల్లేశ్వరికి వాహనంలోనే నార్మల్ డెలివరి చేశారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డలిద్దరూ క్షేమంగా ఉన్నారని చెప్పారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు వివరించారు.

చెక్కు పంపిణీ

వెల్దండ: మండల పరిధిలోని మర్రిగుంతతండాకు చెందిన సోని కుటుంబానికి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా మంజూరు చేసిన రూ.16,500 చెక్కును వెల్దండ బీఆర్ఎస్ అధ్యక్షుడు భూపతిరెడ్డి మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. మాజీ ఎంపీపీ జయప్రకాష్, అలీ, జంగయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కోడేరు: మండలంలోని నాగులపల్లికి చెందిన వీరపాగ చంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని సింగిల్ విండో డైరెక్టర్ మల్లెపల్లి జగన్మోహన్‌రెడ్డి పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటస్వామి, మిద్దెల కృష్ణ, శేఖర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బల్మూర్: మండలంలోని చెన్నారంలో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కాశన్న యాదవ్ తన తండ్రి రామస్వామి జ్ఞాపకార్థం రూ.3 లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన్ను యాదవ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందించారు.

ఫారెస్టు అధికారులకు జింకపిల్ల అప్పగింత

కోడేరు: మండలంలోని సింగాయిపల్లికి చెందిన మేకల కాపరి మల్లయ్య తన మేకలను తీసుకొని మంగళవారం వ్యవసాయ పొలానికి వెళ్తూ.. ఓ వ్యవసాయ పొలంలో చెట్ల పొదల్లో జింక పిల్ల ఉండటంతో గమనించి జింక పిల్లను ఇంటికి తీసుకొచ్చాడు. ఈ విషయంపై కాలనీ వాసులకు చెప్పడంతో వారు వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు అక్కడికి చేరుకుని జింకపిల్లను స్వాధీనం చేసుకుని అడవిలో వదిలినట్లు ఫారెస్టు అధికారి కిరణ్ తెలియజేశారు.

సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడి



ఉప్పునుంతల శివారులో పత్తి పంటను పరిశీలించి రైతులకు సూచలిస్తున్న ఏడీఏ చంద్రశేఖర్

ఉప్పునుంతల: రైతులు ప్రస్తుతం వానాకాలం పంటగా సాగు చేసిన పత్తి పంటకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే ఆశించిన దిగుబడి వస్తుందని అచ్చంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం ఉప్పునుంతల శివారులో రైతులు సాగు చేసిన పత్తి పంటను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు పంటను పరిశీలిస్తూ.. పురుగులు, తెగుళ్లు ఆశించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పంటకు ఆశించే గులాబీ రంగు పురుగు, రెక్కల పురుగు నియంత్రణ కోసం అక్కడక్కడ లింగాకర్షణ బుట్టలను అమర్చుకోవాలని చెప్పారు. పేనుబంక నివారణకు జిగురు అట్టాలు అమర్చుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ అప్‌డేట్ చేసుకోని రైతులు ఈ నెలాఖరులోగా చేయించుకోవాలన్నారు.

పొదుపును సక్రమంగా చెల్లించుకోవాలి

తెలకపల్లి: స్వయం సహాయక సంఘాల మహిళలు పొదుపులను సకాలంలో చెల్లించుకోవాలని ఐకేపీ ఏపీఎం నిరంజన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో సాయంత్రం మహిళా సంఘాల సమావేశం నిర్వహించిరు. మొత్తం మండలంలో 745 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని పొదుపులు 100 నుంచి 200ల వరకు పొడగింపు చేసుకోవాలని మహిళా సంఘాలకు సూచించారు. ప్రతి సంఘం 2 సంవత్సరాలకు ఒక సారి నాయకత్వ మార్పిడి చేసుకోవాలని, ఆడిట్ జరుపుకున్న గ్రామసంఘాలన్నీ సర్వసభ్య సమావేశాలు జరుపుకోవాలని సూచించారు. ప్రతి గ్రామ సంఘం లావాదేవీలు చెక్కు రూపంలో జరుపుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఫుడ్ ప్రాసెస్ యూనిట్ జీవనోపాధులను మెరుగుపరుచుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘంలోని సభ్యులు వారి జీవన విధానం ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, మొబైల్ నంబర్ తీసుకున్న రుణాలు ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పించారు. జీవనోపాధిపై అన్ని అంశాలను ఈ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించుకోవాలని, అదే విధంగా పొదుపులను సక్రమంగా చెల్లించుకోవాలన్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో మొండి బకాయిలు లేవని అన్నారు. ప్రతిఒక్కరు కూడా జీవనోపాధుల ద్వారా అభివృద్ధి చెందాలని, క్రమం తప్పకుండా రుణాలను చెల్లిస్తూ పొదుపులు చెలించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 32 మంది గ్రామ సంఘాలకు 22 గ్రామ సంఘాలు పాల్గొన్నాయి. సమాఖ్య కోశాధికారి అమృత, ఏపీఎం నిరంజన్, లలితమ్మ, పార్వతమ్మ, అలివేల, నారాయణమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ అవకతవకలపై విచారణ



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

నాగర్‌కర్నూల్ రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో నాగర్‌కర్నూల్ మండల ఉపాధిహామీ పథకం పనులపై నిర్వహించిన 12వ విడత సోషల్ ఆడిట్ ప్రజావేదిక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఆయా గ్రామాల్లో కొనసాగించిన ఉపాధిహామీ పథకంపై జరిగిన అవకతవకలపై విచారణ జరిపారు. దాదాపు మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో చేసిన పనులపై చిన్న అవకతవకలకు సంబంధించి రూ.25,898 వరకు అవకతవకలు జరిగాయని, వాటిని సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీకి ఆదేశించారు. ఎంపీడీఓ కోటేశ్వర్‌తో పాటు ఉపాధి హామీ అధికారులు, ఆడిట్ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ రేరా చైర్మన్‌ను కలిసిన ఎడ్మ సత్యం



కల్వకుర్తి: మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ రేరా చైర్మన్‌గా నియామకమైన డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ సత్యనారాయణను మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఛాంబర్ ప్రెసిడెంట్ రాజు, సలహాదారు వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

ఖాతాదారులకు బీమా సౌకర్యం



మాట్లాడుతున్న డీసీసీబీ మేనేజర్ భూపాల్‌రెడ్డి

లింగాల: డీసీసీబీలో ఖాతాదారులకు పలు రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని అచ్చంపేట డీసీసీబీ మేనేజర్ భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సూరాపూర్ రైతు వేదికలో అంబట్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడారు. 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు ఉన్నవారు ఖాతా తీసుకుంటే సంవత్సరానికి రూ.20 ప్రీమియం చెల్లిస్తే ప్రమాదంలో మరణించిన వారికి రూ.2 లక్షల బీమా వస్తుందని తెలిపారు. 18 నుంచి 50 సంవత్సరాల వారు ఏడాదికి రూ.436 చెల్లిస్తే అనారోగ్యంతో మరణించినా రూ.2 లక్షల బీమా సౌకర్యం పొందుతారని వెల్లడించారు. క్రాప్‌లోన్ తీసుకున్న రైతులు రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ పాండు, బ్యాంక్ సూపర్‌వైజర్ మోహన్, రైతు సమితి గ్రామ కోఆర్డినేటర్ బాత్క శ్రీనివాస యాదవ్, రైతులు పాల్గొన్నారు.

హరితహారంపై దృష్టి సారించాలి



గుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గంగమోహన్

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో తెలంగాణకు హరితహార కార్యక్రమం విజయవంతానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ గంగమోహన్ అన్నారు. ఆయా నర్సరీల్లోని మొక్కలను సిద్ధం చేయాలన్నారు. మంగళవారం మండల కేంద్రంలో చేపట్టిన తెలంగాణకు హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల తవ్విన గుంతలను పరిశీలించారు. ప్రధాన రోడ్లకు ఇరువైపుల అంచున నాటకుండా దాదాపు 10 నుంచి 20 ఫీట్ల దూరంలో నాటాలన్నారు. సంబంధిత అధికారులు ఇచ్చిన స్థలాలను గుర్తించి గుంతలు తవ్వి మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. మండలంతో పాటు అన్ని గ్రామాల్లో 1,48,000 ల మొక్కలు నాటే లక్ష్యం చేరుకోవాలన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై తరగతులు

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై తరగతులు నిర్వహించారు. మంగళవారం ఈ తరగతుల్లో ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ మాదిరెడ్డి ఆండాలమ్మ ప్రసంగించారు. జీవితంలో ఎంచుకోవాల్సిన లక్ష్యాలు, వాటిని సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు విద్యార్థి దశ నుంచే సిద్ధం చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షల్లో రాణించే విధానాలను వివరించారు. అమ్మాయిలు సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌ను పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. మార్క్‌పోలోనియస్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కేసీఆర్ కిట్ అందజేస్తున్న డాక్టర్ వెంకటదాస్

తాడూరు: సమాజంలోని నిరుపేదల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటదాసు సూచించారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కేసీఆర్ న్యూట్రీషన్ కిట్‌లను గర్భిణులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండు సార్లు సంబంధిత డాక్టర్ వద్ద పరిశీలించుకున్న గర్భిణులకు ఈ కిట్లు అందజేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు నిర్వహించుకుంటే ప్రభుత్వం ద్వారా వచ్చే వివిధ పథకాలు వర్తిస్తాయన్నారు. వైద్యాధికారి డాక్టర్ సంతోష్ అభిరాం, డాక్టర్ మౌనిక, సిబ్బంది రాజేశ్వరి, జ్యోతి, శ్రీనివాసులు, అవంతి, అనురాధ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మిషన్ పరివర్తన్ వాల్‌పోస్టర్ల విడుదల



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అమ్రాబాద్: మిషన్ పరివర్తన వాల్‌పోస్టర్లను మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసులు మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు కావొద్దని సూచించారు. యువత చెడు అలవాట్లకు పాల్పడకుండా అన్ని గ్రామాల్లో అవగాహన కల్పించాలని, ఇందు కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, డిప్యూటీ సర్పంచ్ రఘురామాచారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయమణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ కూల్చివేత

వెల్దండ: మండల పరిధిలోని చెర్కూర్‌లో శిథిలావస్థలోని నీటి ట్యాంక్‌ను గ్రామపంచాయతీ సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. ప్రమాదభరితంగా ట్యాంక్ ఉండడంతో ప్రజలు భయందోళన చెందుతున్నారు. గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో ట్యాంక్‌ను కూల్చివేశారు. గ్రామంలో పెరిగిన జనాభా దృష్ట్యా తాగునీరు సరఫరాకు ఉన్న ట్యాంక్‌లు సరిపోవడం లేదన్నారు. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరో ట్యాంక్ నిర్మించి సరిపడా తాగునీరు అందించాలని కోరుతున్నారు.

సొంతింటి నిర్మాణం చేపట్టకుంటే ఉద్యమం

నాగర్‌కర్నూల్ రూరల్: తెలంగాణలో ఎక్కడ చూసినా గుడిసెల్లోనే ప్రజలు నివాసం ఉంటున్నారని తెలంగాణ పోరాట సంఘాల వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య ఆరోపించారు. మంగళవారం సింగిల్ విండో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బడా బాబులకు వందల ఎకరాలు కట్టబెడుతూ.. పేదలకు ఇంటి జాగ ఇవ్వడానికి పోలీసులతో దాడులు చేస్తున్నారని ఆరోపించారు. పేదలు గుడిసెల్లో నివసిస్తుంటే ప్రధాన మంత్రి రూ.467 కోట్లతో విశాలమైన విలాసవంతమైన భవనం నిర్మించుకుంటున్నారని విమర్శించారు. ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నామనే ప్రధాని 9 సంవత్సరాల్లో ఒక్క ఇళ్లైనా నిర్మించారా అని ప్రశ్నించారు. రెండు పడకల గదుల కోసం రాష్ట్రంలో 13 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారని గుర్తుచేశారు. ప్రజాసంఘాల నాయకులు సాగర్, ఆర్.వెంకట్రాములు, స్కైలాబ్, రమేశ్, గంగారెడ్డి, ఆనంద్, ఆర్ శ్రీనివాసులు, గీత, కాశన్న పాల్గొన్నారు.

ఎంపీ కోమటిరెడ్డిని కలిసిన సుంకిరెడ్డి



కల్వకుర్తి: ఐక్యతా ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తూ వచ్చిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం ఢిల్లీలో భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించినట్లు రాఘవేందర్ రెడ్డి విలేకరులకు చెప్పారు.

ఇంటింటికీ బీజేపీ

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని రావిచెట్టు వీధిలో మంగళవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. 85వ బూత్ అధ్యక్షుడు శ్రీకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. నర్సింహ, రాఘవేందర్‌గౌడ్, రవిగౌడ్, హరికృష్ణ శర్మ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్ఐ, సర్పంచ్

అమ్రాబాద్: నేర రహిత మండలంగా పదరను తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రం పదరలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎనిమిది సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత తాగుడు, జూదం తదితర అలవాట్లతో కొంత మంది చెడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో ఎవ్వరు తప్పుడు పనులకు పాల్పడినా గుర్తించవచ్చని, అందుకు ఈ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్ కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ రాము

వెల్దండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు రిజ్వర్ బ్యాంక్ ఇండియా ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక విద్య అనే అంశంతో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు వెల్దండ ఎస్‌బీఐ బ్యాంక్ వారు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రాము, ఆయా పాఠశాలల జీహెచ్‌ఎం అంజయ్య, శ్రీశైలం, శ్రీనివాసులు, అశోక్‌రెడ్డి, జగన్, మురళీ మనోహర్‌రావు తదితరులు ఉన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూబీఐ బ్యాంకు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా రుణాల దరఖాస్తులు పరిశీలించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కులవృత్తిదారులకు మంజూరు చేయతలపెట్టిన రూ.లక్ష రుణాల దరఖాస్తులను నిష్పక్షపాతంగా పరిశీలన జరపాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు ఆశయ్య అన్నారు. మంగళవారం ఆయన నాగర్‌కర్నూల్‌లో విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీకి సంబంధించిన దరఖాస్తులను మాత్రమే అధికారులు పరిశీలన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొట్ర నవీన్, శేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల సహకారం



బిజినేపల్లిలో నోట్ పుస్తకాలతో విద్యార్థులు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌కి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం గ్రామానికి చెందిన డీలర్ రాజేష్, శ్రీనివాసులు, విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామపెద్దలు జగత్ చంద్రయ్య, మనోహర్ రెడ్డి, చిన్నకృష్ణారెడ్డి, చెన్నయ్య, సత్యనారాయణ, వెంకట్, రాము తదితరులు పాల్గొన్నారు.

సహకారాన్ని వినియోగించుకోవాలి

తాడూరు: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాతలు ఇచ్చిన సహాయ సహకారాలను వినియోగించుకోవాలని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మేడిపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కావాల్సిన విద్యాసామగ్రిని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అందించారు. దాతలు శ్రీకాంత్, చెన్నకేశవులు, కర్ణాకర్ విద్యార్థులకు రూ.18 వేల విలువ చేసే సామగ్రిని అందించడం అభినందించ దగ్గ విషయమన్నారు. పాఠశాల హెచ్‌ఎం సాయిప్రభ, ఉపాధ్యాయులు కర్ణాకర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ వితరణ

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఇదే పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేసి రిటైర్డ్ అయిన ఎస్.సైదులు నోట్‌బుక్స్‌లను ఉచితంగా పంపించగా.. వాటిని మంగళవారం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

అమ్రాబాద్: పదర మాలమహానాడు మండల ముఖ్యకార్యకర్తల సమావేశం మంగళవారం రాయలగండి లక్ష్మీశ్రీ చెన్నకేశవస్వామి ఆలయం వద్ద నిర్వహించారు. సమావేశంలో మాలమహానాడు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా మద్దెల చెన్నరాయుడు, ఉపాధ్యక్షుడిగా అద్దంకి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, వర్కింగ్ అధ్యక్షుడిగా సుబ్బదాసు, కార్యదర్శి శ్రీనివాసులుతో పాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పోలీసులకు ఫిర్యాదు

వంగూరు: మండలంలోని తిప్పారెడ్డిపల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ పొలానికి సంబంధించి రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరగడంతో ఇరు వర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎస్ఐ కురుమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... రెండు కుటుంబాల మధ్య గతంలో భూ తగాదాలు పరిష్కారం అయ్యాయని, మళ్లీ ఆదివారం ఘర్షణలో హరిదాసు, శ్రీనివాసులు గాయపడ్డారు. ఫిర్యాదులపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆషాఢ మాసం గోరింటాకు సంబరాలు



అచ్చంపేట రూరల్: పట్టణంలోని రక్షిత మహిళా సొసైటీ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఆషాఢ మాసం గోరింటాకు సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు. మహిళలంతా ఒక చోట గుమిగూడి స్వయంగా గోరింటాకు మెహందీని తయారు చేసుకున్నారు. గోరింటాకు విశిష్టతను చాటి చెప్పారు. కార్యక్రమంలో రక్షిత మహిళా సొసైటీ అధ్యక్షురాలు చేపూరి జయమ్మ, ప్రధాన కార్యదర్శి మాధవి, కోశాధికారి అంజలి, గిరిజ, కళావతి, సంధ్య, హేమలత పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



అచ్చంపేటలో రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

అచ్చంపేట రూరల్: రక్తదానం మహాదానమని అచ్చంపేట ఎస్ఐ గోవర్ధన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం రాజశేఖర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎస్ఐ ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది తీవ్ర రక్తస్రావంతో ప్రాణాలు వదులుతుంటారని, రక్తదానం చేయడంతో ఆపదలోని వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 21 మంది రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్టీసీ సిబ్బంది చంద్రయ్య, జేఆర్ రెడ్డి, ఇందిరమ్మ, జోజమ్మ, కాశన్న పాల్గొన్నారు.

కల్వకుర్తి టౌన్: రక్తదానంతో మరొకరికి ప్రాణదాతలుగా నిలవాలని కల్వకుర్తి డిపో మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం కల్వకుర్తి డిపోలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రక్తపు నిల్వలు చాలా తక్కువగా ఉండటంతో ఆపదలో మరొకరికి అవసరమయ్యేందుకు కార్యక్రమాన్ని ఎండీ చేపట్టారని మేనేజర్ తెలియజేశారు. డిపోలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 మంది ఆర్టీసీ ఉద్యోగులు, 8 మంది అద్దెబస్సు డ్రైవర్లు, అయిదుగురు బయట వ్యక్తులు కలిపి 53 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులకు అందించారు. ఎస్టీఐ శ్వేత, శంకర్, శ్రీను సిబ్బంది పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 42 మంది ఉద్యోగులు శిబిరంలో రక్తదానం చేశారు. ఏఎస్ఐ నిరంజన్‌నాయక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నరేష్‌రెడ్డి దేవేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఈద్గా విస్తరణ పనులు పరిశీలన

కొల్లాపూర్: పట్టణ సమీపంలోని ఖాదర్‌బాషా దర్గా వద్ద ఉన్న ఈద్గా విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయి. మంగళవారం జామెమసీద్ కమిటీ నాయకులు పనులను పరిశీలించారు. బక్రీద్ పర్వదినం నాటికి పనులు పూర్తవుతాయని అన్నారు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో ఈద్గా విస్తరణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. జామెమసీద్ కమిటీ చైర్మన్ ఖాజా చావుష్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రుక్నుద్దీన్, అలీ, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ హామీ ఉట్టిదేనా?

మన్ననూర్: ఆర్య వైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వైశ్యుల్లో ఉన్న పేదలను ఆదుకుంటామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఉట్టిదేనా అని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అసోసియేట్ కార్యదర్శి వెంకటరమణ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నిల హామీగా ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఓట్లు దండుకుని గద్దెనెక్కి ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో 10 శాతంగా ఉన్న ఆర్యవైశ్యులు కుల వృత్తిని బట్టి ఒక్కొక్కరికి ఇతర వర్గాల్లోని వందల మందితో ఆర్థిక తదితర సంబంధాలు ఉంటాయని అన్నారు. ఆర్యవైశ్యులకు ఉన్న సంబంధాలను బట్టి 40 నుంచి 50 శాతం ఓటర్లను ప్రభావితం చేసే శక్తి ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి తీరుతామని హెచ్చరించారు.

సారా పట్టివేత

బల్మూర్: మండలంలోని కొండనాగులలో మంగళవారం సారా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శివానందంగౌడ్ తెలిపారు. చౌటతండాకు చెందిన కాట్రావత్ పార్వతి సారా విక్రయిస్తుండగా ఆమె నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.